
# పోతనభాగవతంలో రసగుళికలు

## – ఆర్.శర్మ దంతుర్తి



## 16 వ భాగం

### *హిరణ్యకశిపుడు – 1*

క. శ్రీ మద్విఖ్యాతిలతా
క్రామితరోదోంతరాళ! కమనీయమహా
జీమూతతులితదేహా!
శ్యామలరుచిరజాల! రామచంద్రనృపాలా! [7-1]

రాముడికింకో కందం రాసి మొదలు పెట్టేడు పోతన మళ్ళీ. ఇప్పుడు సప్తమ స్కందంలో హిరణ్యకశిపుడు, వాడు కోరిన వరాలూ, ప్రహ్లాదుడూ, నృసింహావతారం అన్నీ ఒక్కోటిగా వస్తాయి. ఈ స్కందంలో పోతన రాసిన పద్యాల మాధుర్యం సొంతంగా చదవాలి తప్ప నోటితో చెప్పగలిగేది కాదు. నృసింహావతారం ఆవిర్భావంలో పోతన రాసిన వచనం మీద తెలుగు భాషలో సులభంగా పెద్ద పరిశోధన చేయొచ్చు. హిరణ్యాక్షుడి కథలో చెప్పినట్టూ ఇందులో కూడా ఎక్కడా హిరణ్యకశిపుణ్ణి కించపర్చడం కానీ, తిట్టడం కానీ ఉండదు.

అసలు ఈ కథ మహాభారతంలో – కృష్ణుడు శిశుపాలుణ్ణి చంపేక అతనిలోంచి ఒక తేజస్సు వచ్చి కృష్ణుడిలో కలిసిపోతుంది; అది చూసి యుధిష్టురుడు అక్కడే ఉన్న నారదుడ్ని అడగడంతో – ప్రారంభం అవుతుంది. ఇలా అడుగుతున్నాడు ధర్మరాజు ఆశ్చర్యంగా.

ఆ. ఎట్టివారి కైన నేకాంతులకు నైన,
వచ్చి చొరఁగ రాని వాసుదేవు
తత్త్వమందుఁ జేది ధరణీశుఁ డహితుఁడై,
యెట్లు జొచ్చె? మునివరేణ్య! నేఁడు [7-10]

ఉ. వేనుఁడు మాధవుం దెగడి విప్రులు దిట్టిన భగ్నుఁడై తమో
లీనుఁడు గాఁడె తొల్లి; మదలిప్తుఁడు చైద్యుఁడు పిన్ననాటనుం
దేనియు మాధవున్ విన సహింపఁడు భక్తి వహింపఁ డట్టివాఁ
డే నిబిడప్రభావమున నీ పరమేశ్వరునందుఁ జొచ్చెనో? [7-11]

మ. హరిసాధింతు హరిన్ గ్రసింతు హరిఁ బ్రాణాంతంబు నొందింతుఁ దా
హరికిన్ వైరినటంచు వీఁడు పటురోషాయత్తుఁడై యెప్పుడుం
దిరుగుం, బ్రువ్వదు నోరు, వ్రీలిపడ దా దేహంబు, దాహంబుతో
నరక ప్రాప్తియు నొందఁ, డే క్రియ జగన్నాథుం బ్రవేశించెనో? [7-12]

"ఎవరికీ అందని వాసుదేవుడు ఇతనికి ఎలా అందేదు? ఇతడికి చిన్నప్పట్నుంచీ దంతవక్త్రుడితో కలిసి రోజూ హరిని తిట్టడం తప్ప వేరే పనేమీ ఉన్నట్టు కనిపించదు. ఇటువంటి వాళ్ళకి నరకం ప్రాప్తించాలి నిజానికి. కానీ వీడి తేజస్సు జగన్నాథుడిలో ఎలా ప్రవేశించిందో నికు తెలిసి ఉండవచ్చు. నాకు విశదీకరించు." ఈ వింత వివరించమంటే, దీనికి నారదుడి సమాధానం ఇంకా వింతగా ఉంటుంది. శిశుపాల దంతవక్త్రులు జయవిజయులే మూడో జన్మలో ఇలా శ్రీహరికి శతృవులుగా పుట్టేరని చెప్పాక,

"ఈ శరీరం నాది. నేను ఇలా అందంగా ఉన్నాను. నన్ను వీళ్ళు ఇలా తిడుతున్నారు" అనే ఆలోచనలు మనకి మమకారం వల్ల వస్తాయి. నేనూ నాది అనేవి శరీరానికి సంబంధించినవి. వీటితో పరమాత్మకి సంబంధం లేదు అని చెప్తున్నాడు. పరమాత్మ మన శరీరంకేసి చూడదు. ఇతడి మనసు నా మీద ఉందా లేదా అనేదే ఆయనక్కావాల్సింది.

..... ధర్మనందనునకు నారదుం డి ట్లనియె; "దూషణభూషణతిరస్కారంబులు శరీరంబునకుం గాని పరమాత్మకు లేవు; శరీరాభిమానంబునం జేసి దండవాక్పారుష్యంబులు హింసయై తోఁచు తెఅంగున; నేను నాయది యనియెడు వైషమ్యంబును భూతంబులకు శరీరంబునందు సంభవించు; అభిమానంబు బంధంబు; ... కర్తృత్వ మొల్లనివానికి హింసయు సిద్ధింపదు; సర్వ భూతాత్మకుండైన యీశ్వరునికి వైషమ్యంబు లేదు; [7-13]

ఆ. అలుక నైనఁ జెలిమి నైనఁ గామంబున
నైన బాంధవమున నైన భీతి
నైనఁ దగిలి తలఁప నఖిలాత్ముఁ డగు హరిఁ
జేర వచ్చు వేఱు జేయఁ డతఁడు [7-14]

క. వైరానుబంధనంబునఁ
జేరిన చందమున విష్ణుఁ జిరతర భక్తిం
జేరఁగ రాదని తోఁచును
నారాయణభక్తి యుక్తి నా చిత్తమునన్. [7-15]

"కోపంతో గానీ, స్నేహంతో గానీ, భయంతో గానీ ఆయన్ని చేరవచ్చు. ఎలా గుర్తుంచుకున్నా ఆయా భావాల్ని బట్టి భగవంతుడు భక్తుల్ని వేరు చేయడు. అయితే స్నేహితుడిగా కానీ, భక్తి తో గానీ జేరడం కష్టంగానూ, ఇప్పుడు శిశుపాలుడూ వాళ్ళూ చావడం చూసాక వైరంతో జేరడం సులభం అనీ నా మనసుకి అనిపిస్తోంది. " నారదుడు ఇలా అనడానికి కారణం ఏమిటంటే ఈ జయ విజయులు అను క్షణం శ్రీహరిని తల్చుకుంటూ వైరంవల్లే మూడు జన్మల్లో శ్రీహరిని చేరుకున్నారు. అయితే భక్తి వల్ల ఎన్ని జన్మలు పడుతుందో తెలియదు కదా?

శా. కామోత్కంఠత గోపికల్, భయమునం గంసుండు, వైరక్రియా
సామాగ్రిన్ శిశుపాలముఖ్య నృపతుల్, సంబంధులై వృష్ణులుం,
బ్రేమన్ మీరలు, భక్తి నేము, నిదె చక్రింగంటి; మెట్లైన ను
ద్ధామధ్యానగరిష్ఠుఁడైన హరిఁ జెందన్ వచ్చు ధాత్రీశ్వరా! [7-18]

కామంతోటి గోపికలూ, అనుక్షణం చచ్చిపోతానేమో అనే భయంతో కంసుడూ, వైరంతోటి రాజులందరూ, బంధుత్వం వల్ల వృష్ణియులూ అందరూ కూడా పరంధాముణ్ణి చేరగలిగారు. అందుచేత ఆయన్ని గుర్తుంచుకోవడం అనేది ముఖ్యంగానీ ఎలా గుర్తుంచుకున్నామనేది అంత ముఖ్యం కాదు.

మరిప్పుడు అసలు జయవిజయులకి విష్ణువుతో వైరం ఎందుకొచ్చిందనే ప్రశ్న వస్తోంది కనక ఇప్పుడు జయవిజయుల వృత్తాంతం చెప్పమంటే నారదుడు మొదటినుంచీ చెప్పుకొస్తున్నాడు.

శ్రీహరి యజ్ఞ వరాహ రూపంలో హిరణ్యాక్షుణ్ణి చంపేశాడు కదా? తన తమ్ముడి తప్పు ఏముంది? బ్రహ్మ వరం ఇచ్చాడు తన ఇష్టం వచ్చినట్టూ బతకమని. దానితో తమ్ముడు భూమిని తీసుకెళ్ళి రసాతలంలో దాచాడు. తనంతతానుగా విష్ణువుమీదకి వెళ్ళలేదే? యజ్ఞ వరాహమే తమ్ముడిమీదకొచ్చింది, భూమిని వెతుక్కుంటూ. ఇలా ఆలోచిస్తే తమ్ముడు పరాక్రమం ప్రదర్శించి, వీరమరణం పొందేడు. కానీ ఇందులో తప్పు పూర్తిగా విష్ణువుదే. అందుచేత హిరణ్యకశిపుడు రాక్షసుల సభ ఏర్పాటుచేసి చెప్పేడు అందరితోటీ.

శా. నాకుం దమ్ముఁడు మీకు నెచ్చెలి రణన్యాయైకదక్షుండు బా
హాకుంఠీకృతదేవయక్షుఁడు హిరణ్యాక్షుండు వానిన్ మహా
సౌకర్యాంగము దాల్చి దానవవధూసౌకర్యముల్ నీఱుగా
వైకుంఠుండు వధించిపోయెనఁట యీ వార్తాస్థితిన్ వింటిరే. [7-30]

చ. వనములనుండుఁ జొచ్చు ముని వర్గములోపల ఘోణిగాఁడు సం
జనన మెఱుంగ రెవ్వరును జాడ యొకింతయు లేదు తన్ను డా
సిన మఱి డాయు వెంటఁబడి చిక్కక చిక్కఁడు వీని నొక్క కీ
లున మన మెల్ల లోఁబడక లోఁబడఁ బట్టుకొనంగవచ్చునే? [7-31]

"మనం చేసిన తప్పు ఏమీలేదు. నా తమ్ముణ్ణి వరాహరూపంలో వచ్చి నీళ్ళలో చంపేసి పోయేడుట ఆ వైకుంఠుడు, విన్నారా? ఆయనెక్కడుంటాడో ఎవరికీ తెలియదుట. మనం యుద్ధనికెళ్తే మాత్రం సిద్ధంగా ఉంటాడు కానీ వెంటబడి పట్టుకోవడానికి వెళ్తే కనిపించడు. మునుల్లో ఉంటాడుట. ఈ ఘోణిగాడిని (అంటే వరాహస్వరూపుడు) ఎలా పట్టుకోవాలో మనకి తెలియకుండా ఉంది. అందుచేత మీరందరూ ఈ మునుల్నీ గోవుల్నీ, యజ్ఞాలనీ తగలబెట్టండి. ఈ విష్ణువు మాయావి. మనమంటే పడదు. మనిషిలాగా వచ్చి చంపొచ్చు. తమ్ముణ్ణి చంపినట్టూ జంతువులాగా చంపొచ్చు. నీళ్ళలో చంపేడు అంటే అక్కడ కూడా ఈ మాయావికి తిరుగులేదు. అందుచేత విష్ణువుని చంపడానికి

నేను వెళ్తున్నాను." ఇలా శపథం చేసి ముందు తల్లి దగ్గిరకి వెళ్ళేడు; తమ్ముడు పోయిన దుఃఖాన్ని ఓదార్చడానికి. ఇక్కడ హిరణ్యకశిపుడు తల్లిని ఓదార్చడంలో చెప్పే సత్యాలూ, వాడు తర్వాత కోరే వరం అన్నీ మనం, మన మనస్సూ ఎంత కలగాపులగంగా ఆలోచిస్తాయో చెబుతాయి.

హిరణ్యకశిపుడి మనః స్థితి చూద్దాం. తన తమ్ముణ్ణి విష్ణువు చంపేసాక ఇతనికి "ఈరోజు తమ్ముణ్ణి చంపేడు కనక రేపు తన పరిస్థితి ఏమిటీ" అనే ఆలోచన రావడం సహజం. ప్రపంచంలో భగవంతుడెక్కడ ఉంటాడు అనడిగితే, దాని సమాధానం చెప్పేవాడ్ని బట్టి మారుతూ ఉంటుంది. బ్రహ్మ జ్ఞానిని అడిగితే ఆయన "భగవంతుడు లేనిదెక్కడ?" అనొచ్చు. మామూలు మనిషిని అడిగితే, "ఇంట్లో, బయట, గుడిలో" అనొచ్చు. అదే గేదె ని అడిగితే "గడ్డిలో, పాలల్లో, నా దూడలో" అంటుందేమో. నాస్తికుణ్ణి అడిగితే? ఎందుకంటే మన చుట్టూ జరిగే విషయాలమీద మన అవగాహనబట్టి మన మనస్సుకి అందే సమాధానం బయటకి చెప్తూ ఉంటాం కదా? ఇదే పద్ధతిలో హిరణ్యకశిపుడు ఆలోచించేడు. తమ్ముణ్ణి నీళ్ళల్లో చంపేసాడు జంతువురూపంలో. నీళ్ళల్లోకి రాగలిగేడంటే గాలిలోకీ రాగలడు కాబోలు. అలాగే జంతువులా వచ్చేడంటే మనిషిలాగా, దేవతలాగా రాగలడన్నమాట. చేతిలో ధనుస్సూ (అంటే దానికి కావాల్సిన అస్త్రాలు, అస్త్ర విద్యలూ క్షుణ్ణంగా తెల్సి ఉంటాయి), గద, శంఖ చక్రాలు ఉంటాయని చెప్తున్నారు. దేవతలకి స్నేహితుడని తెలుస్తోంది.

ఇలా ఆలోచించి ఒక పథకం ప్రకారం విష్ణువుని జయించడానికి నిర్ణయించుకున్నాడు. దీనికి మొదట కావాల్సింది తపస్సు చేసి వరాలు సంపాదించడం. ఎందుకంటే శత్రువుకున్న బలానికి దీటుగా తనకిప్పుడున్న బలం సరిపోదు. బలాబలాలు చూసుకోకుండా యుద్ధానికి దిగడం అంటే చావు కొనితెచ్చుకున్నట్టే కదా? ఎలాంటి వరాలు కోరుకోవాలో తెల్సిపోయింది కదా ఈ ఆలోచనలతో? కానీ ఇక్కడే హిరణ్యకశిపుడు పప్పులో కాలు వేసాడు. అదేమిటంటే పుట్టిన ప్రతీ ప్రాణీ గిట్టక తప్పదు అని తెల్సీ తను ఎంచుకున్న అజ్ఞాత, అజాత శత్రువైన భగవంతుడిమీద యుద్ధం ప్రకటించడం. ఓ రకంగా చూస్తే హిరణ్యకశిపుడు (ఆ లెక్కన బలి చక్రవర్తి కూడా) ఒక బ్రహ్మాండమైన విశ్లేషణాత్మకమైన తెలివితేటలు ఉన్నవాడు. కానీ భగవంతుడు ఎంతటి విశ్లేషణ కీ అందేవాడుకాదు కదా?

హిరణ్యకశిపుడు తన తమ్ముడు పోయేదాకా విష్ణువుని తల్చుకున్నాడో లేమో మనం ఎరగం కానీ తమ్ముడు పోయినప్పటినుంచీ అనుక్షణం కోపంతో తల్చుకుంటూనే ఉన్నాడు. అలాగ మనసు విష్ణువుమీదే ఉండడం వల్ల వాడికోసం ప్రత్యేకంగా నృశింహావతారం ఎత్తేడు శ్రీహరి. ఈ విధంగా చూస్తే రోజూ "దేముడూ లేడు, గాడిద గుడ్డూ లేదు" అనే నాస్తికులు ప్రతీ క్షణం దేముడ్నే తల్చుకుంటూ ఆస్తికులకన్నా భగవంతుడికి దగ్గిరగా ఉన్నారని చెప్పుకోవచ్చు.

రాక్షసులంటే వేరే ఎవరూలేరు. మన మనస్సు పరమ దరిద్రంగా ఉన్నప్పుడు మనమే దానవులం. అది శుద్ధమైన మనస్సైతే మనమే దేవతలమూను. ఇది అంతకు ముందు అంబరీషోపాఖ్యానంలో దూర్వాసుడి గురించి చదువుకున్నప్పుడు చూసాం. మనస్సనేది మాత్రమే భగవంతుడికి ముఖ్యం. అందుకే శంకర భగవత్పాదులు శివానందలహరిలో ఇలా అంటారు.

కరస్తే హేమాద్రౌ గిరీశ నికటస్తే ధనపతౌ
గృహస్తే స్వర్భూజామర సురభి చింతామణి గణే
శిరస్తే శీతాంసౌ చరణ యుగళస్తే అఖిల శుభౌ
కమర్థం దాస్యే జహం భవతు భవదర్థం మమ మనః [శివానందలహరి – 27]

“పరమ శివా, బంగారు కొండైన హేమాద్రి నీ చేతిలోనే ఉంది. అత్యంత ధనవంతుడైన కుబేరుడు నీ స్నేహితుడే. నీ ఇంటి ముంగిట్లోనే కల్ప వృక్షం, కావలసినవన్నీ సమకూర్చే చింతామణి, కామధేనువు ఉన్నాయి. చల్లదనాన్నిచ్చే చంద్రుడు నీ శిరస్సుమీదే ఉన్నాడు. సకల శుభాలు నీ పాదాల్లోనే ఉన్నాయి. అటువంటి నీకు నేనిచ్చేదేమీ కనిపించదు కనుక నా మనస్సే నీదవుగాక.”

జయవిజయులు వైకుంఠంలో శపించబడినప్పుడు వాళ్ళడిగిన వరం ఏమిటంటే, "రాక్షసులమైనా పుట్టినప్పుడు విష్ణుభక్తి ఉండాలి" అని. ఆ వరంచేతనే ఇద్దరూ మూడు జన్మల్లోను అలా శ్రీహరిని తల్చుకుంటూనే ఉన్నారు. వచ్చే వ్యాసంలో హిరణ్యకశిపుడి తపస్సూ, బ్రహ్మ వరాలు.

పోతన భాగవతం ఇంటర్నెట్లో ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS